

# కాన్షియెన్షియత

పులిపాక రాజుద్దీన్



ఆఫీసంతా కోలాహలంగా ఉంది ఆ లంచ్ అవర్‌లో

"ఇవ్వాళ్ల ముగ్గురు క్యాబినెట్ మంత్రులు రాజీనామా చేసారు విన్నారా? పదవులనుంచే కాదు పార్టీనుంచి కూడా'

"ఈ ప్రభుత్వం మరి నిలబడేట్టు లేదు, రోజులు లెఖ్ఖ పెట్టవచ్చు"

"నెక్స్‌ట్ చీఫ్ మినిష్టరు ఎవరవుతారని మీ ఉద్దేశ్యం" రకరకాల వాఖ్యలతో, ఊహలతో, ఉద్దేశ్యాలతోవాతావరణం వేడిగా, వాడిగా ఉంది.

కానీ మాధవరావుకి ఇదేమీ పట్టినట్టు లేదు. అతను ప్రాక్టికల్ మనిషి. మరో రెండు రాళ్లు ఎలా సంపాదించ వచ్చునా అన్న ఆలోచనే తప్ప నడుస్తున్న చరిత్రతో అతనికే సంబంధమూలేదు. ఆఫీసులో అందరికీ పై సంపాదన పుష్కలంగా ఉన్నందువల్ల ఈ చొప్పదంటు రాజకీయాలు వాళ్లకి ఆశక్తిని కలిగిస్తున్నాయని అతని భావం. అతను చేస్తున్నది స్టెనోగ్రాఫరు ఉద్యోగం కాబట్టి అతనికి పైసంపాదనకి అవకాశాలేలేవు. ఎందుకూ కొరగానీ చెత్తంతా తనకి డిక్టేట్ చేసే ఆఫీసర్లు, అత్యవసరమైన డ్రాఫ్టులను చక్కగా చేత్తోనే రాసుకుంటారు. ఆస్థానమృదంగ విద్వాంసుడిలాఎప్పుడూ టైపు రైటరు ముందు కూర్చొని అక్షరాలు బాదుకొనే ఈ ఉద్యోగంలో అతనికి గ్లామరూకనపడలేదు, పైసంపాదనా లేదు. అందుకే అతనికి ఏ విషయమూ ఆశక్తిని కలిగించదు. లంచ్ అవర్ ముగియడంతో ఎవరి సీట్లోకి వాళ్లు వెళ్లిపోయారు. ఆఫీసరు హడావుడిగా వచ్చి తన గదిలోకి వెళ్లిపోయాడు. మాధవరావు రివాజు ప్రకారం తన షార్టుహ్యాండు పుస్తకం

పెన్సిలు పుచ్చుకుని ఆఫీసరుగారి గదిలోకి వెళ్లాడు.

"ఇవ్వాళ్ల ఇంకేమీ పనిలేదు మాధవరావు గారూ, అన్నట్టు ఇనస్పెక్షన్ నోట్‌టైప్ చేసారా?" అన్నాడు ఆఫీసరు.

"లాష్టుపేజీ చేసి కరక్షన్ చేయాలి సార్, అయిపోవచ్చింది." అన్నాడు మాధవరావు తెలివిగా, ఇంకే జిడ్డు అంటిస్తాడో అని ముందు జాగ్రత్తతో. నిజానికి అపని ఎప్పుడో పూర్తయిపోయింది. ఇంతలో జీపు డ్రయివరు గదిలోకివచ్చాడు.

"రెడీయా?" అన్నాడు ఆఫీసరు.

"రెడీయేసార్" అన్నాడు డ్రయివరు.

"చూడండి మాధవరావు గారూ, నేను అర్జంటుగా కాన్ఫరెన్సుకి వెళుతున్నాను. సాయంత్రంలోగా ఆ ఇనస్పెక్షన్ నోట్ ఎలాగైనా పూర్తి చేయాలి" అంటూ డ్రయివరుతో సహాహడావుడిగా వెళ్ళిపోయాడు ఆఫీసరు. హడావుడిలో ఆఫీసు డ్రాయరు తాళం వేయడం మరిచిపోయాడు. మాధవరావు ఒక్కడే గదిలో ఉన్నాడు. అతని గుండె గుబగుబలాడింది. 'ధైర్యేసాహసేలక్ష్మీ' అనుకున్నాడు. తెగించి ఆఫీసరు గారిటేబుల్ డ్రాయరు తెరిచాడు. మీదనే తనక్కావాల్సిన ఫైలుంది. ఫైలుతీసి తెరిచాడు. అందులో తనక్కావాల్సిన కాగితం మీదనే ఉంది. ఒళ్లంతా చెమటలు పోసాయి. ఇంతసేపు గదిలో ఉంటే ఎవరికైనా అనుమానం రావచ్చు. సూపరిండెండెంటు లోనికొచ్చి 'ఏం చేస్తున్నావిక్కడ?' అని నిలదీయొచ్చు ఆలస్యం అమృతం విషం, వెంటనే కాగితాన్ని తీసిటేబులు మీదపెట్టి చకచకా అందులోఉన్నది తన పార్టుహ్యాండు పుస్తకంలో రాసుకున్నాడు. కాగితాన్ని యధావిధిగా పెట్టేసి డ్రాయరు మూసేసాడు. కర్చిఫ్‌తో మొహనికి పట్టిన చెమట తుడుచుకుంటూ గది బయటకువచ్చేసాడు. అతనినెవ్వరూ గమనించలేదు. తన సీట్లో కూర్చొని, పుచ్చపువ్వులాటి తెల్లని కాగితాన్ని ఎక్కించి తను సంపాదించిన ఇన్‌ఫర్మేషన్ని నీటుగా టైపుచేసాడు. వారం రోజులక్రితం జరిగిన టీచర్స్ ఇంటర్‌వ్యూ ఫలితాల పట్టిక అది. మొత్తం నలభైమంది సెలక్టయ్యారు. వాళ్లకి ఇలా ఉద్యోగాలొచ్చేసాయన్న సంగతి తెలియడానికి అధమం పక్షం రోజులు పడుతుంది. పేర్లు ఎలాగూ తనచేతిలో ఉన్నాయికాబట్టి ఉద్యోగం వేయిస్తానని తలా రెండు వేలు వసూలు చేస్తే? కనీసం పాతికమందిని పట్టినా యాభైవేలు. మాధవరావుకు ఒళ్లుపులకించింది. ఆ లిష్టును భద్రంగా జేబులో పెట్టుకున్నాడు. పార్టుహాండు పుస్తకంలో కాగితాన్ని చించి అవతల పారేసాడు.

ఆవేళ సాయంత్రానికల్లా పదిమందిని పట్టాడు మాధవరావు. రాత్రి ఎనిమిదో గంటకల్లా ఇరవైవేలు చేతిలోపడ్డాయి. అతనిలో ఉత్సాహం పుంజుకుంది. భోజనం చేసిరోడ్డుమీదపడ్డాడు. మరో ఇరవై మంది దొరికారు. మర్నాడు దర్శనం చేసుకుంటామన్నారు. మర్నాడు ఉదయం పదిగంటలకల్లా మరో ముప్ఫయి వేలు కలక్షనయ్యింది. ఇంతడబ్బు కంట పడేసరికి మతిపోయింది మాధవరావుకి. ఆఫీసుకి రెండు రోజులు సెలవు పెట్టేసాడు. గాంధీ నగర్‌లో అమ్ముడవుతున్న హవుస్‌ప్లాట్‌ను బావమరిది పేర కొనేసాడు. సాయంత్రానికల్లా రిజిస్ట్రేషన్ అయిపోయింది. ఆరుదాటంగానే మరో పదివేలు జమ అయ్యాయి. మాధవరావు విలాసంగా పెళ్లాం పిల్లలతో బజారుకు బయల్దేరాడు. రోడ్డుమీద జనం గుంపులు గుంపులుగా చేరి కాఫీ హోటల్ రేడియోలో వార్తలు ఎంటున్నారు. ప్రభుత్వం పడిపోయింది. గవర్నరుగారు ప్రతిపక్ష నాయకుణ్ణి ప్రభుత్వాన్ని చేపట్టమని ఆహ్వానించారు. అదీ వార్త. ఇందులో ఇంత ఆశక్తి చూపించవలసిన విశేషమేమిటో మాధవరావుకి బోధపడలేదు. పిల్లలకి తనకి చక్కని రెడిమేడ్ దుస్తులు తీసుకున్నాడు. భార్యకో రెండు పట్టు చీరలూ, నిత్య వాడకానికి మరో రెండు చీరలు కొన్నాడు. టాక్సీలో ఇంటికొచ్చాడు. కలర్ టీవీతో సహా.

మరునాడు ఉదయానికల్లా వెట్ గ్రెయిండరూ, గాద్రెజ్ బీరువా, ఫ్రిజ్ వచ్చాయి. వాటితోపాటు అవి కొనుక్కోడానికి డబ్బులిచ్చిన మహనుభావులు కూడా వచ్చారు కట్టకట్టుకుని.

"ఏమిటి సంగతులు?" అన్నాడు మాధవరావు.

"ఒకవేళ మాకు ఉద్యోగాలు రాకపోతే' అన్నాడు వాళ్లలీడరు.

"మీ డబ్బు మీకు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తాను."

"థ్యాంక్యూ, ఒక వేళ మీరు ఇవ్వక పోతేనో అని మావాళ్లసంశయం" అన్నాడు లీడరు.

"ఎంతమాట సున్నంలోకి ఎముకల్లేకుండా చితగ్గొట్టేయరా, ప్రాణంకన్నా డబ్బుతీపా,? అంతేకాక పోలీసుల్లేరా, కోర్టుల్లేవా" అన్నాడు మాధవరావు. శెలవు తీసుకుని అంతావెళ్లి పోయారు. కొత్త ముఖ్యమంత్రి ఆయనతోపాటు నలుగురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేయడం కలర్ టీవీలో చూసాడు. మృష్టాన్న భోజనం చేసి రెష్టు తీసుకున్నాడు. మూడో రోజు కూడా శెలవు పెట్టి సరదాగా ఇంట్లోనే గడిపాడు. సాయంత్రం మాత్రం ఫ్యామిలీతో షికారుకెళ్లి అట్నుంచి అటే స్టారు హోటలుకు వెళ్లి భోజనం ముగించాడు. సరదాగా. పిల్లలు ముచ్చట పడుతున్నారని అపక్కనే ఉన్న హాల్లో ఇంగ్లీషు సినిమా చూపించి అర్ధరాత్రికి ఇంటికి చేరుకున్నాడు టాక్సీలో

మరునాడు టిప్పుటాపుగా కొత్తబట్టల్లో కొత్తపెళ్లికొడుకులా ఆఫీసుకు వెళ్లాడు "కొత్త డ్రస్సాగురూజీ?" అన్నవాళ్లతో "కొత్త ప్రభుత్వంలో కొత్త డ్రస్సే" అనిజోక్ విసిరాడు. తన పార్టుహ్యాండు పుస్తకం పెన్సిలు పుచ్చుకుని ఆఫీసరు గదిలోకి వెళ్లాడు. ఆఫీసరూ, సూపరెండెండెంటు నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు.

"నమస్కారం సార్, ఏమిటో నవ్వుకుంటున్నారూ, నాకూచెప్పండి సార్ సంతోషిస్తా" అన్నాడు హుషారుగా. ఆఫీసరు చెప్పమన్నట్టు కళ్ళు ఎగరేసాడు.

సూపరెండెండెంటు మాధవరావు వైపు తిరిగి "ఏడవలేక నవ్వుకుంటున్నాం. మన కష్టమంతా వృధాపోయి కథ మొదటికొచ్చింది. ఈ నెల మనం చేసిన ఇంటర్‌వ్యూని కొత్త ప్రభుత్వం క్యాన్సిలు చేసింది. మరో ఆరునెలల వరకూ ఎటువంటి ఇంటర్‌వ్యూలు కానీ ఎపాయింట్‌మెంట్స్‌కానీ చేయకూడదు. అదీ కథ" అన్నాడు నవ్వుతూ.

●